# కరెంట్ అఫైర్స్

**1.** 2018, ఏప్రిల్ 5న బాబూ జగ్జీవన్‌రామ్ ఎన్నో జయంత్యుత్సవాలను దేశవ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు?

(దిల్లీలోని రాజ్‌ఘాట్ సమీపంలోని బాబూ జగ్జీవన్‌రామ్ స్మారక ప్రాంతమైన 'సమతాస్థల్' వద్ద కేంద్ర సామాజిక న్యాయం, సాధికారతల శాఖ మంత్రి తావర్‌చంద్ గెహ్లోత్, సహాయమంత్రి రామ్‌దాస్ అథవాలే, లోక్‌సభ మాజీ స్పీకర్, జగ్జీవన్‌రామ్ కుమార్తె మీరాకుమార్ తదితరులు నివాళులర్పించారు. బాబూ జగ్జీవన్‌రామ్ 1936 నుంచి 1986 వరకు 50 సంవత్సరాల పాటు చట్టసభల సభ్యుడిగా వ్యవహరించి ప్రపంచ రికార్డు సృష్టించారు. భారత్-పాకిస్థాన్ యుద్ధ సమయంలో 1971లో భారత రక్షణ మంత్రిగా పనిచేశారు 1977 నుంచి 1979 వరకు భారత ఉప ప్రధానమంత్రిగా ఉన్నారు. జగ్జీవన్‌రామ్ కుమార్తె మీరాకుమార్ 2009 నుంచి 2014 వరకు లోక్‌సభ స్పీకర్‌గా బాధ్యతలు నిర్వర్తించారు.)

ఎ) 91 బి) 101 సి) 111 డి) 121

**2.** 2018, ఏప్రిల్ 5న ముంబయిలో నిర్వహించిన ఆర్‌బీఐ పరపతి విధాన సమీక్ష ప్రకారం 2018 – 19 ఆర్థిక సంవత్సరానికి జీడీపీ వృద్ధిరేటును ఎంత శాతంగా అంచనా వేశారు? (రెపోరేటు 6% రివర్స్ రేటు 5.75%, బ్యాంకురేటు 6.25 శాతంగా యథాతథంగా కొనసాగించారు.)

ఎ) 7.2% బి) 7.4% సి) 7.6% డి) 7.8%

**3.** 2018, ఏప్రిల్ 5న అలీనోద్యమ దేశాల (ఎన్‌ఏఎం) 18వ మధ్యకాలిక మంత్రుల సమావేశాన్ని ఎక్కడ నిర్వహించారు?

(విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి సుష్మా స్వరాజ్ ఈ సమావేశంలో పాల్గొని ప్రసంగించారు.)

ఎ) బాకూ బి) బెల్‌గ్రేడ్ సి) జకార్తా డి) కైరో

**4.** 2018, ఏప్రిల్ 4న ఏ రాష్ట్రంలో అయిదుగురు బాబాలకు (సాధువులు) అక్కడి భాజపా ప్రభుత్వం రాష్ట్ర సహాయ మంత్రుల హోదా కల్పించింది? (నర్మదా నది సంరక్షణకు ఏర్పాటైన 'జన్ జాగృక్త అభియాన్ సమితి'లో 2018, మార్చి 31న వీరంతా నియమితులయ్యారు.)

ఎ) గుజరాత్ బి) ఉత్తర్ ప్రదేశ్ సి) ఛత్తీస్‌గఢ్ డి) మధ్యప్రదేశ్

**5.** సీబీఎస్‌ఈ పరీక్షల నిర్వహణ, లోపాలపై సమీక్షించేందుకు కేంద్ర మానవ వనరుల శాఖ 2018, ఏప్రిల్ 4న ఏర్పాటుచేసిన ఉన్నత స్థాయి కమిటీకి ఎవరు నేతృత్వం వహిస్తున్నారు? (లీక్ తదితర లోపాలు లేకుండా సాంకేతికత సాయంతో పటిష్ఠ పద్ధతిలో పరీక్షలు నిర్వహించేందుకు ఈ కమిటీ సూచనలు చేయనుంది. మే 31 నాటికి ఈ కమిటీ తన నివేదికను అందజేయాల్సి ఉంది.)

ఎ) అశోక్ మహుల్ బి) వినయ్‌శీల్ ఓబెరాయ్

సి) ఈశ్వర్ భగత్ డి) కిషన్ మహరాజ్

**6.** ప్రభుత్వ రంగ బ్యాంకులు 2014 ఏప్రిల్ నుంచి 2017 సెప్టెంబరు మధ్యకాలంలో ఎంత మొత్తంలో రుణాలు రద్దు (రైట్-ఆఫ్) చేసినట్లు ఇటీవల కేంద్రం వెల్లడించింది? (ఆస్తులు, అప్పుల పట్టిక నుంచి నిరర్థక ఆస్తులు, మొండి బకాయిలను తీసివేసేందుకే బ్యాంకులు ఈ రుణాలను రద్దు చేసినట్లుగా పేర్కొంటాయి. అయితే రుణ గ్రహీతలు ఎప్పటికైనా వాటిని తిరిగి చెల్లించాల్సి ఉంటుంది.)

ఎ) రూ. 2.41 లక్షల కోట్లు బి) రూ. 2.81 లక్షల కోట్లు

సి) రూ. 3.41 లక్షల కోట్లు డి) రూ. 3.81 లక్షల కోట్లు

**7.** 2018, ఏప్రిల్ 3, 4, 5 తేదీల్లో మూడు రోజులపాటు రష్యాలో పర్యటించిన కేంద్ర మంత్రి ఎవరు? (అంతర్జాతీయ భద్రతకు సంబంధించి నిర్వహించిన 7వ మాస్కో సదస్సులో వీరు పాల్గొన్నారు. భారత్-రష్యా దౌత్య సంబంధాలు 70 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా మాస్కోలో చేపట్టిన ఏడాది ఉత్సవాల ముగింపు కార్యక్రమంలోనూ వీరు పాల్గొన్నారు.)

ఎ) ఆర్థిక శాఖ మంత్రి అరుణ్ జైట్లీ బి) విదేశాంగ శాఖ మంత్రి సుష్మా స్వరాజ్

సి) రక్షణ శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ డి) హోంశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్

**8.** నకిలీ వార్తలను పుట్టించే, వ్యాప్తిచేసే విలేకర్ల గుర్తింపు (అక్రిడిటేషన్)ను రద్దు చేయడం లాంటి కఠిన చర్యలను తీసుకుంటామని కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ ఏ రోజున వివాదాస్పద ప్రకటన విడుదల చేసింది? (పత్రికా స్వేచ్ఛపై ఉక్కుపాదం మోపుతున్నారని పాత్రికేయ సంఘాలు, విపక్షాల నుంచి ఆరోపణలు వెల్లువెత్తడంతో ఆ మార్గదర్శకాలను ఉపసంహరించాలని ప్రధాని మోదీ స్వయంగా సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖను ఆదేశించారు. దాంతో ఆ ఉత్తర్వును ఉపసంహరించుకున్నారు.)

ఎ) 2018, ఏప్రిల్ 1 బి) 2018, ఏప్రిల్ 2 సి) 2018, ఏప్రిల్ 3 డి) 2018, ఏప్రిల్ 4

**9.** ఎస్సీ, ఎస్టీ వేధింపుల నిరోధక చట్టంలోని కఠిన నిబంధనలను సడలిస్తూ ఏ రోజున సుప్రీంకోర్టు తీర్పు వెలువరించింది? (ఈ తీర్పునకు వ్యతిరేకంగా దళిత సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు ఏప్రిల్ 2న జరిగిన భారత్ బంద్ హింసాత్మకంగా మారి 11 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ నేపథ్యంలో కేంద్రం సమగ్ర సమీక్ష పిటిషన్‌ను దాఖలు చేసింది. ఏప్రిల్ 3న దీనిపై విచారించిన సుప్రీంకోర్టు తన తీర్పుపై స్టే విధించడానికి నిరాకరించింది. చట్టంలోని ఏ తీర్పునూ తాము నీరుగార్చలేదని తేల్చి చెప్పింది. కేంద్రం దాఖలు చేసిన సమీక్షా పిటిషన్‌ను 10 రోజుల తర్వాత సమగ్రంగా పరిశీలిస్తామని వెల్లడించింది.)

ఎ) 2018, మార్చి 10 బి) 2018, మార్చి 15 సి) 2018, మార్చి 20 డి) 2018, మార్చి 25

**10.** 2018, ఏప్రిల్ 3న రాజ్యసభలో సభా నాయకుడిగా మరోసారి తిరిగి ఎవరు నియమితులయ్యారు? (ఈయన పదవీకాలం ఏప్రిల్ 2తో ముగిసిపోగా, ఉత్తర్ ప్రదేశ్ నుంచి తిరిగి రాజ్యసభకు ఎన్నికయ్యారు.)

ఎ) రాజ్‌నాథ్ సింగ్ బి) అరుణ్ జైట్లీ సి) సురేష్ ప్రభు డి) నితిన్ గడ్కరీ

**11.** కేంద్ర మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖ 2018, ఏప్రిల్ 3న వెల్లడించిన గణాంకాల ప్రకారం దేశంలోనే అత్యుత్తమ ఉన్నత విద్యా సంస్థగా ఏది నిలిచింది? (ఉత్తమ ఇంజినీరింగ్ కళాశాలగా ఐఐటీ-మద్రాస్, ఉత్తమ నిర్వహణ విద్యా సంస్థగా ఐఐఎం – అహ్మదాబాద్ నిలిచాయి.)

ఎ) జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం, దిల్లీ

బి) బెనారస్ హిందూ విశ్వవిద్యాలయం, వారణాసి

సి) ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం, దిల్లీ

డి) ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్, బెంగళూరు

**12.** ఇరాక్‌లోని మోసుల్‌లో ఐసిస్ ఉగ్రవాదులు హతమార్చిన భారతీయుల కుటుంబాలకు ఎంత మొత్తం చొప్పున పరిహారం అందజేయనున్నట్లు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రకటించారు? (ఉపాధి నిమిత్తం 2014లో 40 మంది భారతీయులు ఓ ఏజెంటు ద్వారా అక్రమ మార్గంలో ఇరాక్ వెళ్లారు. అక్కడ ఐసిస్ ఉగ్రవాదులు వీరిని చెరబట్టి 39 మందిని మోసుల్‌లో హత్య చేశారు. ఒక వ్యక్తి మాత్రం తాను బంగ్లాదేశ్ ముస్లింనంటూ తప్పించుకుని భారత్ చేరుకున్నాడు. నాలుగేళ్ల అనంతరం 38 మంది (ఒకరి డీఎన్ఏ సరిపోలేదు) భారతీయుల భౌతికకాయాలను 2018, ఏప్రిల్ 2న విదేశీ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి వీకే సింగ్ స్వయంగా ప్రత్యేక విమానంలో బాగ్దాద్ నుంచి భారత్‌కు తీసుకొచ్చారు)

ఎ) రూ. 10 లక్షలు బి) రూ. 20 లక్షలు సి) రూ. 30 లక్షలు డి) రూ. 50 లక్షలు

**13.** కడక్‌నాథ్ కోళ్లపై ప్రాదేశిక గుర్తింపు (జీఐ) హక్కులను ఏ రాష్ట్రం దక్కించుకుంది? (ఈ రాష్ట్రంలోని ఝబువ, అలిరాజ్‌పూర్ జిల్లాలకు చెందిన గిరిజనులు కడక్‌నాథ్ కోళ్లను పరిరక్షిస్తున్నారు. ఝబువలో 1978లో తొలి కడక్‌నాథ్ కోడిపిల్లల హేచరీ ఏర్పాటైంది.)

ఎ) మధ్యప్రదేశ్ బి) ఛత్తీస్‌గఢ్ సి) ఉత్తర్ ప్రదేశ్ డి) ఉత్తరాంచల్

**14.** చైనా అంతరిక్ష కేంద్రం తియాంగాంగ్–1 ప్రస్థానం ఏ రోజున ముగిసిపోయింది? (నియంత్రణ లేకుండా కొంతకాలంగా కక్ష్యలో తిరుగుతున్న ఈ రోదసి ప్రయోగశాల భూ వాతావరణంలోకి ప్రవేశించి మండిపోయింది. దీని శకలాల వల్ల ఎలాంటి హానీ కలగలేదు. అవన్నీ దక్షిణ పసిఫిక్ మహాసముద్రంలో పడ్డాయి. 8 టన్నుల బరువున్న తియాంగాంగ్–1ను 2011 సెప్టెంబరు 29న ప్రయోగించారు. దీని పొడవు 10.4 మీటర్లు. 2022 నాటికి సొంతంగా ఒక అంతరిక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేసుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్న చైనా దానికి సన్నాహకంగా ఈ ప్రయోగశాలను పంపింది. నాలుగున్నరేళ్లపాటు సేవలు అందించిన తియాంగాంగ్–1 2016 మార్చి నుంచి పనిచేయడం లేదు.)

ఎ) 2018, ఏప్రిల్ 2 బి) 2018, ఏప్రిల్ 4 సి) 2018, ఏప్రిల్ 5 డి) 2018, ఏప్రిల్ 7

**15.** 'బ్యాలెట్ - టెన్ ఎపిసోడ్స్ దట్ హ్యావ్ షేప్డ్ ఇండియాస్ డెమోక్రసీ' అనే పుస్తకాన్ని ఎవరు రచించారు?

ఎ) ఏకే మనోహర్ బి) రమేష్ కిద్వాయ్ సి) కరణ్ జోహార్ డి) విక్రమ్‌పూరి

**సమాధానాలు**

**1-సి; 2-బి; 3-ఎ; 4-డి; 5-బి; 6-ఎ; 7-సి; 8-బి; 9-సి; 10-బి; 11-డి; 12-ఎ; 13-ఎ; 14-ఎ; 15-బి.**

**భారత్‌కు తొలి స్వర్ణం**

★ 2018, ఏప్రిల్ 4న ఆస్ట్రేలియాలోని గోల్డ్‌కోస్ట్‌లో ఉన్న కరారా స్టేడియంలో 21వ కామన్వెల్త్ క్రీడలు ఘనంగా ఆరంభమయ్యాయి. బ్రిటన్ రాణి ప్రతినిధిగా హాజరైన ప్రిన్స్ చార్లెస్ క్రీడలు అధికారికంగా ఆరంభమైనట్లు ప్రకటించారు. మార్చ్‌ఫాస్ట్‌లో భారత బృందానికి స్టార్ షట్లర్ పీవీ సింధు నేతృత్వం వహించారు. ఈ క్రీడల్లో తొలి స్వర్ణాన్ని బెర్ముడా దేశానికి చెందిన మహిళా ట్రయాథ్లెట్ ఫ్లోరాడఫీ (ట్రయాథ్లాన్) నెగ్గింది. భారత్‌కు తొలి స్వర్ణ పతకాన్ని వెయిట్ లిఫ్టర్ మీరాబాయి చాను అందించింది. మహిళల 48 కేజీల విభాగంలో రికార్డులు బద్దలుకొట్టి 196 కిలోలు ఎత్తి స్వర్ణం నెగ్గింది.

**ఆధార్ సంఖ్య - వర్చువల్ ఐడీ**

★ ఆధార్‌తో వ్యక్తిగత గోప్యతకు భంగం కలుగుతోందనే ఆరోపణలకు పరిష్కారంగా భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ (యూఐడీఏఐ) 2018, ఏప్రిల్ 3న ఒక కొత్త ఫీచర్‌ను అందుబాటులోకి తెచ్చింది.

★ వర్చువల్ ఐడీ (వీఐడీ) బీటా వర్షన్‌ను విడుదల చేసింది. ఆధార్ సంఖ్యకు బదులు వినియోగదారులు ఈ వర్చువల్ ఐడీని ఉపయోగించుకోవచ్చు. భవిష్యత్తులో ఆధార్ సంఖ్యకు బదులు వీఐడీనే ఇవ్వవచ్చని యూఐడీఏఐ తెలిపింది. వీఐడీ అనేది 16 అంకెల ర్యాండమ్ సంఖ్య. ఆధార్ సంఖ్యకు ఇది అనుసంధానమై ఉంటుంది.

★ గుర్తింపు వివరాలు కోరే మొబైల్ కంపెనీ లాంటి వాటికి వీఐడీ ఇస్తే పేరు, చిరునామా, ఫొటో లాంటి పరిమిత వివరాలే వెల్లడవుతాయి. సాధారణంగా వ్యక్తుల తనిఖీకి ఈ వివరాలే సరిపోతాయి. ఆధార్ సంఖ్య వెల్లడించాల్సిన అవసరం లేని అవకాశాన్ని వినియోగదారులకు వీఐడీ కల్పిస్తుంది. ఆయా సంస్థలు జూన్ 1 నుంచి వినియోగదారుల వీఐడీ ఆమోదించడం తప్పనిసరి.

**విఫలమైన 'జీశాట్6ఏ'**

భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) మార్చి 29న షార్ నుంచి ప్రయోగించిన జీశాట్-6ఏ ఉపగ్రహంతో సంబంధాలు పూర్తిగా తెగిపోయాయి. పలు దేశాల అంతరిక్ష సంస్థల సాయంతో జీశాట్-6ఏతో సంబంధాల పునరుద్ధరణకు ఇస్రో ప్రయత్నించినప్పటికీ ఎలాంటి ఫలితం లేకపోయింది.

★ 2,140 కిలోల బరువున్న ఈ ఉపగ్రహంలోని ఇంజిన్లను మండించి మార్చి 30, 31 తేదీల్లో జీశాట్-6ఏ కక్ష్యను రెండుసార్లు విజయవంతంగా పెంచారు.

★ ఏప్రిల్ 1న మూడోసారి కక్ష్యను పెంచే క్రమంలో ఉపగ్రహంలోని ఎలక్ట్రిక్ వ్యవస్థలో షార్ట్‌సర్క్యూట్ జరగడంతో జీశాట్-6ఏ మూగబోయినట్లు శాస్త్రవేత్తలు నిర్ధారించారు.

**నాస్కామ్ అధ్యక్షురాలిగా దేవయాని ఘోష్ బాధ్యతలు**

★ నాస్కామ్ (నేషనల్ అసోసియేషన్ ఆఫ్ సాఫ్ట్‌వేర్ అండ్ సర్వీసెస్ కంపెనీస్) అధ్యక్షురాలిగా 2018, ఏప్రిల్ 2న దేవయాని ఘోష్ బాధ్యతలు స్వీకరించారు. ఆర్. చంద్రశేఖరన్ పదవీకాలం ముగిసిన నేపథ్యంలో ఈమె ఆ పదవిని చేపట్టారు.

**రచయిత: సీహెచ్. కృష్ణప్రసాద్**